పలు రైళ్లు రీ షెడ్యూల్

విశాఖపట్నం, జనవరి 27: కుర్దా డివిజన్ పరిధిలో నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో పలు ఒరిజినేటింగ్ రైళ్లను రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ఈ నెల 31వ తేదీన తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్ (17480) నిర్ణీత సమయం కన్నా నాలుగు గంటలు ఆలస్యంగా, చెన్నై సెంట్రల్-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (22826) రెండు గంటలు, తిరునెలివేలి-పురిలియా ఎక్స్‌ప్రెస్ (22606) నాలుగు గంటలు, పాండిచ్చేరి-హౌరా ఎక్స్‌ప్రెస్ (12868) 2.45 గంటలు, చెన్నై-హౌరా ఎక్స్‌ప్రెస్ (12840) 2.30 గంటలు, సికింద్రాబాద్-భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (17016) 2.45 గంటలు ఆలస్యంగా బయలుదేరనున్నాయి.

వైసీపీ ఫ్లాప్ షో

తేలిపోయిన తొలి ఎన్నికల సభ

- 'సిద్ధం' పేరుతో భీమిలి నియోజకవర్గ పరిధిలోని సంగివలసలో నిర్వహణ



అభివాదం చేస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి



సంగివలసలో నిర్వహించిన సభలో సీఎం జగన్ ప్రసంగిస్తున్న సమయంలో ఖాళీగా ఉన్న ప్రాంగణం

- మూడు వారాల నుంచి కసరత్తు
- నియోజకవర్గాల్లో సమావేశాలు
- మూడు లక్షల మందిని సమీకరిస్తున్నట్టు నాయకుల ప్రకటనలు
- 30 వేలకు మించి హాజరుకాని ప్రజలు, కార్యకర్తలు
- వెయ్యికిపైగా ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలు ఏర్పాటు
- అయినా ఫలితం శూన్యం
- అనేక గ్రామాలకు వెళ్లిన బస్సుల్లో ఐదారుగురికి మించి రాని వైనం
- జగన్ ప్రసంగానికి కేడర్ నుంచి స్పందన కరవు
- ఆయన ప్రసంగం ప్రారంభించగానే బయటకు క్యూ కట్టిన జనం

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీ భీమిలి నియోజకవర్గ పరిధిలోని సంగివలసలో శనివారం నిర్వహించిన తొలి ఎన్నికల సభ తేలిపోయింది. ఈ సభను మూడు లక్షల మందితో నిర్వహించబోతున్నామంటూ వైసీపీ నాయకులు ప్రకటిస్తూ వచ్చారు. సభ కోసం మూడు వారాల ముందు నుంచే ఉత్తరాంధ్ర నాయకులు కసరత్తు ప్రారంభించారు. ఆ పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి, సీనియర్ మంత్రి బొత్స సత్యనారాయణ, తదితరులు ఉమ్మడి జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించారు. ప్రతి గ్రామం నుంచి కనీసం వంద మంది చొప్పున, నియోజకవర్గానికి పది వేల మందికి తక్కువ కాకుండా తరలించాలని ఎమ్మెల్యేలు/సమన్వయకర్తలను ఆదేశించారు. ఇందుకోసం అంగ, అర్థ, అధికార బలాన్ని వినియోగించారు. ఇన్ని చేసినప్పటికీ సభకు గట్టిగా 30 వేల మందికి మించి తీసుకురాలేకపోయారు. సభా ప్రాంగణం జనం లేక వెలవెలబోయింది.

జాతీయ రహదారికి ఆనుకుని సంగివలస వద్ద 14 ఎకరాల్లో ఈ సభను ఏర్పాటుచేశారు. ఇందులో 12 ఎకరాల్లో మాత్రమే సభను నిర్వహించారు. వైసీపీ నాయకులు చెప్పినట్టు మూడు లక్షల మందితో సమావేశాన్ని నిర్వహించేందుకు అవకాశం లేదు. గట్టిగా 60 వేల మంది వచ్చినా ఈ ప్రాంగణం కిక్కిరిసిపోతుంది. కానీ, జనాలు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో ప్రాంగణంలో దాదాపు ... మిగతా 5వ పేజీలో

విశాఖ ఊసే లేదు

- ఉత్తరాంధ్ర అభివృద్ధిపై కూడా మౌనం
- అభ్యర్థులపై కూడా స్పష్టత ఇవ్వని వైసీపీ అధినేత
- నేతల్లో విస్మయం - 5లో

ప్రయాణికుల పాట్లు

సీఎం సభకు బస్సులను తరలించడంతో అవస్థలు

- డిపోలోని 98 బస్సులకు గాను 45 తరలింపు
- గంటల తరబడి కాంప్లెక్స్‌లో జనం పడిగాపులు



అనకాపల్లి కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న ప్రయాణికులు

అనకాపల్లి టౌన్, జనవరి 27: బస్సు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. భీమిలి నియోజకవర్గం పరిధిలోని సంగివలస వద్ద శనివారం నిర్వహించే సీఎం సభకు అనకాపల్లి డిపో నుంచి 45 బస్సులను తరలించడంతో ఉదయం నుంచి ప్రయాణికులు అనకాపల్లి పీటీడీ కాంప్లెక్స్‌లో పడిగాపులు కాశారు.

అనకాపల్లి డిపోలో 98 బస్సులు ఉండగా, వాటిలో 45 బస్సులను సీఎం సభకు జనాలను తరలించడానికి పంపడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. సాధారణ రోజుల్లోనే బస్సులు సరిపడక ఇబ్బందులు పడుతున్న క్రమంలో ఇప్పుడు 45 బస్సులను తరలించడంతో విద్యార్థులు సైతం అవస్థలు పడ్డారు. విజయనగరం వెళ్లే ఒక బస్సు సాయంత్రం వేళ కాంప్లెక్స్‌కు చేరుకోగా ఆ బస్సులో గమ్యస్థానాలకు చేరుకోవడానికి యువకులు పరుగులు తీశారు. ఈ బస్సు ప్రయాణికులతో కిటకిటలాడుతూ విజయనగరం వైపు వెళ్లింది. ఇదే కాకుండా ఇతర ప్రాంతాల బస్సులు కూడా ఇదే తరహాలో నడవడం వల్ల ప్రయాణికులు నిలబడి ప్రయాణం చేయాల్సి వచ్చింది. శనివారం తెల్లవారుజామున సీఎం సభకు వెళ్లిన బస్సులు సాయంత్రం పొద్దుపోయినా సరే అందుబాటులోకి రాకపోవడంతో సుదూర, మారుమూల గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడక తప్పలేదు. పలువురు ప్రయాణికులు బస్సులు ఎప్పుడు వస్తాయోనని ఎదురుచూడకుండా ప్రైవేటు వాహనాల్లో గమ్యస్థానాలకు బయలుదేరారు.

బస్సుల కొరతతో ఓ కర్మాగారానికి సెలవు

అచ్యుతాపురం: సీఎం జగన్ సభకు ప్రైవేటు పాఠశాలల బస్సులతో పాటు సెజ్ కర్మాగారాల్లోని కార్మికుల రాకపోకలకు ఉపయోగించే బస్సులను తరలించడంతో ఇబ్బందులు తలెత్తాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో సెజ్‌లోని ఓ దుస్తుల తయారీ కర్మాగారం శనివారం కార్మికులకు సెలవు ప్రకటించింది. రిపబ్లిక్ డే నాడు కూడా పని చేయించిన ఆ సంస్థ శనివారం సెలవు ప్రకటించడంపై కార్మికులు ఆరా తీయగా సీఎం సభకు బస్సులను తరలించడంతో సెలవు ఇవ్వాల్సి వచ్చిందని తెలుసుకున్నారు.



బస్సుల కోసం కాంప్లెక్స్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

అక్రమ మద్యం ఏరులు

పొరుగు రాష్ట్రాల నుంచి కూడా సరకు తీసుకు వస్తున్న అక్రమ వ్యాపారులు

- ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి కూడా తరలింపు
- గ్రామీణ ప్రాంతాల్లో తీర్థాల నేపథ్యంలో భారీగా నిల్వ
- పట్టించుకోని సెబ్ అధికారులు



అనకాపల్లి మిరియాల కాలనీలోని ఓ ఇంట్లో సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు (ఫైల్)

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అక్రమ మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో అక్రమ మద్యం వ్యాపారులు రెచ్చిపోతున్నారన్న విమర్శలున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తనిఖీలు చేసి మొక్కుబడిగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప అక్రమ మద్యం అమ్మకాలకు అడ్డుకట్ట వేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

జిల్లాలో సంక్రాంతి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో వరుసగా తీర్థాలు జరుగుతున్నాయి. దీంతో అక్రమ వ్యాపారులు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా మద్యం సీసాలను తెప్పించి భారీగా నిల్వ చేస్తున్నట్టు సమాచారం. వీరికి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సిబ్బంది సహకారం ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. గతేడాది మాడుగుల మండలం గాదెరాయి గ్రామంలో పోలీసులు జరిపిన తనిఖీల్లో భారీగా పట్టుబడిన మద్యం నిల్వల వెనుక ఒక సెబ్ ఉద్యోగి ప్రమేయం ఉన్నట్టు తెలిసింది. దీనిపై అప్పట్లో కొంతమంది ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు లేవు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది భారీగా మద్యం సీసాలను అక్రమ వ్యాపారులకు ఇస్తున్నట్టు సమాచారం. దీనిపై నిఘా పెట్టాల్సిన సెబ్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రెండు రోజుల కిందట అనకాపల్లి పట్టణంలో సెబ్ పోలీసులు మిరియాల కాలనీలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 909 మద్యం సీసాలను పట్టుకున్నారు. దీని విలువ సుమారు రూ.1.75 లక్షలుగా వెల కట్టారు. మామిడిపాలేనికి చెందిన ఓ ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి కొనుగోలు చేసినట్టు గుర్తించారు. అయితే దుకాణం నుంచి మద్యం సీసాలను తరలించిన సంబంధిత ఉద్యోగిపై కేసు కూడా నమోదు చేయలేదు. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రుజువైతే చర్యలు తీసుకుంటాం

మద్యం డిపో నుంచి దుకాణాలకు సరకు చేరవేసే వరకే మా బాధ్యత. అక్రమంగా బెల్టు దుకాణాలకు తరలిస్తే వారిపై సెబ్ అధికారులు చర్యలు తీసుకోవలసి ఉంటుంది. అనకాపల్లిలో ఇటీవల పట్టుబడిన మద్యం ప్రభుత్వ దుకాణం నుంచి అక్రమంగా రవాణా చేసినట్టు ఎఫ్‌ఐఆర్‌లో నమోదు చేసినట్టు మాకు సమాచారం లేదు. ప్రభుత్వ దుకాణాల నుంచి మద్యం పక్కదారి పట్టినట్టు రుజువైతే చర్యలు తీసుకుంటాం.

- ఎన్.వెంకటరమణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్, అనకాపల్లి

వైభవంగా గవరపాలెం గౌరమ్మ జాతర



గవరపాలెం గౌరీ పరమేశ్వరులు

ఆకట్టుకున్న నేలవేషాలు

- అమ్మవారిని దర్శించుకున్న రాజకీయ నాయకులు
- పోటెత్తిన భక్తులు



జాతరను తిలకించడానికి వచ్చిన జనంతో రద్దీగా ఉన్న రోడ్డు

అనకాపల్లి టౌన్, జనవరి 27: జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన అనకాపల్లి గవరపాలెం గౌరీ పరమేశ్వరుల జాతర శనివారం వైభవంగా ప్రారంభమైంది. వేకువజామున సతకంపట్టులోని గౌరీ పరమేశ్వరులకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి అలంకరణ చేశారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే భక్తులు ఆలయానికి రావడం ప్రారంభమైంది. జాతర సందర్భంగా ఆలయానికి వచ్చే రహదారులు భక్తులతో కిక్కిరిసిపోయాయి, అమ్మవారిని మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రులు దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ పట్టణశాఖ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, పాత్రికేయుడు వీవీ రమణమూర్తి, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ, ఆస్క్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కొణతాల బాల సుబ్రహ్మణ్యంలతో పాటు వైసీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకోగా, వారిని ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. నూకాంబిక ఆలయం తరుపున ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్‌లు అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పించారు. అనంతరం గౌరీ పరమేశ్వరులను ప్రత్యేక రథంపై ఏర్పాటు చేయగా ఊరేగింపును కేంద్ర విజిలెన్స్ సెక్రటరీ వైవీవీ రాజశేఖర్ ప్రారంభించారు. సాయంత్రం జాతరలో భాగంగా ఏర్పాటు చేసిన కేరళ వాయిద్యాలు, గరగల నృత్యాలు, కోలాటాలు, పులివేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిననాలుగురోడ్ల జంక్షన్ నుంచి రింగురోడ్డు, సుంకరమెట్ట జంక్షన్ వరకు భారీ ఎత్తున ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది. 27 చోట్ల ఉత్సవ కమిటీ వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు డీఎస్పీ వి.సుబ్బరాజు, పట్టణ సీఐ జి.శంకరరావు ఆధ్వర్యంలో సుమారు 300 మంది సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, ఏఆర్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

వైసీపీలో వర్గపోరు

- దిబ్బపాలెంలో ప్రారంభానికి ముందే శిలాఫలకం ధ్వంసం
- సొంత పార్టీ వారే చేశారని ఆరోపణలు



దిబ్బపాలెంలో ధ్వంసమైన శిలాఫలకం

అచ్యుతాపురం, జనవరి 27: మండలంలో అత్యధిక ఓట్లు కలిగిన సెజ్ పునరావాస కాలనీ (దిబ్బపాలెం)లో వైసీపీ వర్గ పోరు బయటపడింది. ఇక్కడ రెండు వర్గాలు ఉన్న విషయాన్ని ఎమ్మెల్యే కన్నబాబు రాజు దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోకపోవడంతో పోరు తారస్థాయికి చేరి శిలాఫలకం ధ్వంసం చేసే స్థాయికి వెళ్లింది.

ఇక్కడ నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఈ నెల 29న ఎమ్మెల్యే కన్నబాబు రాజు ప్రారంభించనున్నారు. అయితే సొంత పార్టీలోని కొందరు వ్యక్తులు శుక్రవారం రాత్రి ఆ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారని ప్రచారం జరుగుతోంది. తెలుగుదేశం పార్టీకి కంచుకోట అయిన దిబ్బపాలెం పంచాయతీలో సుమారు తొమ్మిది వేల ఓట్లున్నాయి. గత పంచాయతీ ఎన్నికల్లో ఈ పంచాయతీని వైసీపీ గెలుచుకుంది. సర్పంచ్‌తో పాటు ముగ్గురు ఎంపీటీసీ సభ్యులను కూడా వైసీపీ గెలుచుకుంది. ఇక్కడ ఎమ్మెల్యే కన్నబాబు రాజు మాటకు ఎదురులేదు. అయినా వర్గ పోరు కారణంగా శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. శిలాఫలకంపై ఒక వర్గానికి చెందిన పేర్లు లేనందున దీనిని ధ్వంసం చేసినట్టు పలువురు చర్చించుకుంటున్నారు. కాగా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇటువంటి సంఘటన జరగడం చర్చనీయాంశమైంది.

రబీ పంటలపై దృష్టి పెట్టాలి

- రైతులకు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ జగన్నాథరావు సూచన



మాట్లాడుతున్న ఏడీఆర్ జగన్నాథరావు

కొత్తూరు, జనవరి 27: జిల్లా రైతులు రబీ పంటలపై దృష్టి సారించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ పీవీకే. జగన్నాథరావు సూచించారు. శనివారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో నిర్వహించిన రైతు భరోసా టీవీ వర్క్‌షాపులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రబీ సీజన్‌లో ఆరు తడి పంటలను పండించాలన్నారు. రైతులు రబీ పంటలపై శ్రద్ధ తీసుకొని ఎరువుల యాజమాన్యంతోపాటు సకాలంలో చీడపీడల యాజమాన్యం చేపట్టి అధిక లాభాలను పొందవచ్చునని తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ఇటీవల కురిసిన వర్షాలకు నేలలో లభించే తేమ ఉపయోగించి నువ్వులు, అపరాలు, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేసుకోవచ్చునని తెలియజేశారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ ఆశాదేవి, చెరకు ప్రధాన శాస్త్రవేత్త ఆదిలక్ష్మి, డాక్టర్ కేవీ రమణమూర్తి, డాక్టర్ శిరీష, డాక్టర్ సీతారామలక్ష్మి, డాక్టర్ పి.శ్రీదేవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు వ్యవహరించారు.

క్రైం... crime news

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరి మృతి

▸ మృతుడు కాకినాడ జిల్లా వాసి


నాగేశ్వరరావు (ఫైల్)

కొయ్యూరు, జనవరి 27: మండలంలోని పెదమాకవరం గ్రామ సమీపంలో శనివారం ట్రాక్టర్ బోల్తా పడడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి కొయ్యూరు ఎస్ఐ కె.రామకృష్ణ అందించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లాలోని పెదపూడి గ్రామానికి చెందిన చిట్టూరి నాగేశ్వరరావు (50) కొయ్యూరులోని శరభన్నపాలెంలో కౌలు చేస్తున్న భూమిలో పండిన వరి గడ్డిని తీసుకువెళ్లడానికి తన కుమారుడు శ్రీనుతో కలిసి వచ్చారు. గడ్డి లోడ్ చేసుకుని శనివారం తెల్లవారు జామున వెళ్తుండగా పెద మాకవరం సమీపంలోని కొండ కాలువలో అదుపుతప్పి దూసుకుపోయారు. దీంతో ట్రాక్టర్ ఇంజన్ కింద నాగేశ్వరరావు చిక్కుకుని అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కాగా, అంతవరకు ట్రాక్టర్‌పై ఉన్న శ్రీను ఎదురుగా వస్తున్న ఇతర వాహనాలు కట్టడి చేసేందుకు వంతెన ప్రారంభంలో కిందకు దిగాడు. ఆ సమయంలో ట్రాక్టర్ బోల్తా కొట్టడంతో శ్రీనుకు ప్రమాదం తప్పింది. శ్రీను ఫిర్యాదు మేరకు కొయ్యూరు ఎస్ఐ కేసు నమోదు చేశారు. శవ పంచనామా అనంతరం పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద వార్త తెలుసుకుని భార్యతో పాటు కుటుంబీకులు తరలివచ్చి కన్నీరు మున్నీరుగా విలపించడం చూపరులను కలచివేసింది.

కోడి పందాలు ఆడుతున్న ఐదుగురు అరెస్టు

సబ్బవరం, జనవరి 27: మండలంలోని ఎల్లుప్పి, నల్లరేగులపాలెం గ్రామాల్లో కోడి పందాలు ఆడుతున్న ఐదుగురుని పట్టుకొని శనివారం కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్లుప్పిలో బుదిరెడ్ల మోహన్, లోకిరెడ్డి అప్పలరాజు, కొట్యాడ అప్పలరాజు వద్ద రెండు కోడి పుంజులు, రూ.400, నల్లరేగులపాలెంలో గొలగాన లోవరాజు, సత్తిబాబు వద్ద రెండు కోడి పుంజులు, రూ.400 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని తెలిపారు.

కాయిన్స్ ఆట ఆడుతున్న ముగ్గురి అరెస్టు

సబ్బవరం, జనవరి 27 : అమృతపురం శివారు సూరెడ్డిపాలెం జాతీయ రహదారి పై ఓవర్ వద్ద శనివారం సాయంత్రం కాయిన్ ఆట ఆడుతున్న ముగ్గురుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. వారి వద్ద నుంచి 10,400 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మద్యం కేసులో వ్యక్తి అరెస్టు

అనకాపల్లి టౌన్, జనవరి 27: అక్రమ మద్యం కేసులో గాంధీనగరానికి చెందిన యల్లంకి లీలామోహన గోవిందరావును శనివారం అరెస్టు చేసినట్టు సెబ్ సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక మిరియాలకాలనీ మూడో వీధిలోని ఒక ఇంటిపై శుక్రవారం దాడి చేయగా 909 అనధికార మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి లీలా మోహన గోవిందరావును అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు తెలిపారు. ఈ సరుకు ఎక్కడి నుంచి వచ్చిందో పూర్తి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం

లంకెలపాలెం, జనవరి 27: రెండు బెల్ట్ దుకాణాలపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించి 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. కన్నూరు పంచాయతీ పరిధి మడకపాలెం గ్రామానికి చెందిన కరణం పైడమ్మ పాన్‌షాప్‌లో మద్యం విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్ఐ సురేశ్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. దుకాణంలో ఉన్న 4 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఆమెను అరెస్టు చేశారు. అలాగే మంత్రిపాలెంలో లారీ యార్డు సమీపంలో పాన్‌షాప్‌పై పోలీసులు దాడి చేసి, 4 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పాన్‌షాపు యజమాని రాజును అరెస్టు చేశారు. ఈమేరకు కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం వ్యతిరేకం కాదు

▸ మంత్రి బొత్స సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం, జనవరి 27: ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రైవేటు పాఠశాలలకు నష్టం కలుగజేయాలన్న ఆలోచన ఎప్పుడూ లేదన్నారు. ప్రైవేటు పాఠశాలలతో సమానంగా ప్రభుత్వ పాఠశాలలను నడుపుతున్నామని, అందులో ఎటువంటి దురుద్దేశం లేదన్నారు. అనంతరం ఎమ్మెల్సీ, ఆ సంఘం రాష్ట్ర (అపూస్మా) అధ్యక్షుడు ఎంవీ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ చంద్రకళ, అపూస్మా రాష్ట్రస్థాయి కమిటీ ప్రతినిధులు బి.జనార్దనరెడ్డి, ఎ.కృష్ణారెడ్డి, ఎంవీ సుబ్బారెడ్డి, ఎంవీ రావు, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఎంవీవీ సత్యనారాయణ, జి.శేష గిరిరావు పాల్గొన్నారు.

హైవే పైనే వాహనాల పార్కింగ్‌తో అవస్థలు


హైవేపై ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసిన వాహనాలు

నక్కపల్లి, జనవరి 27: మండల కేంద్రంలో ప్రతీ శుక్రవారం జరిగే వారపు సంతకు ఎంతో గుర్తింపు వుంది. ఈ సంతలో ఎండుచేపలు, మేకలు, గొర్రెల క్రయ, విక్రయాలు జరుగుతుంటాయి. అందుకే శుక్రవారం తెల్లవారుజాము నుంచి అనేక ప్రాంతాల నుంచి అమ్మకందారులు, కొనుగోలుదారులు ఇక్కడకు వస్తుంటారు. వాహనాలను ఇష్టానుసారంగా హైవేపై నిలిపివేస్తున్నారు. ప్రతీ శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఇదే పరిస్థితి నెలకొంటోంది. హైవేపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపడం వల్ల అనేక ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. వీటిని నిరోధించాల్సిన హైవే పెట్రోలింగ్ పోలీసులు కనీసం పట్టించుకోవడం లేదు. హైవేపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

ఘనంగా గౌరమ్మ జాతర


గవరపాలెం గౌరీపరమేశ్వరుల ఊరేగింపును ప్రారంభిస్తున్న కేంద్ర విజిలెన్స్ సెక్రటరీ రాజశేఖర్


ఉత్సవంలో గరగల డ్యాన్సు చేస్తున్న కళాకారులు


నవదుర్గల నాట్యం


గౌరమ్మను దర్శించుకున్న మంత్రి అమర్‌నాథ్


మాజీ మంత్రి దాడి వీరభద్రరావుని సన్మానిస్తున్న దృశ్యం


గౌరమ్మను దర్శించుకున్న మాజీ మంత్రి కొణతాల


అమ్మవారిని దర్శించుకున్న బుద్ద నాగజగదీష్

విశాఖ ఊసే లేదు

▸ ఉత్తరాంధ్ర అభివృద్ధిపై కూడా మౌనం ▸ అభ్యర్థులపై కూడా స్పష్టత ఇవ్వని వైసీపీ అధినేత ▸ నేతల్లో విస్మయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాబోయే ఎన్నికలకు 'సిద్ధం' అంటూ విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గ పరిధిలోని సంగివలస నుంచి సమరశంఖం పూరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్నం గురించి గానీ, ఉత్తరాంధ్ర అభివృద్ధిపై గానీ ఒక్క ముక్క మాట్లాడలేదు. విశాఖలో పరిపాలనా రాజధాని ఏర్పాటు చేస్తా, నగరానికి దసరాకు వస్తా..డిసెంబరులో వస్తా...అంటూ నాలుగేళ్లుగా ఊరింపు మాటలు చెప్పిన వైసీపీ అధినేత...ఇప్పుడు ఆ ప్రస్తావనే తేలేదు. ఉత్తరాంధ్రాను ఉద్ధరించడానికే మూడు రాజధానులు అంటూ చెప్పిన ఆయన ఆ ఉత్తరాంధ్రాకు ఏమి చేశారో కూడా చెప్పలేక పోయారు. ఈ ఐదేళ్లలో ఈ ప్రాంతానికి ఏమి చేశారో చెప్పి ఓట్లు అడుగుతారని అంతా భావించారు. చెప్పుకోవడానికి ఏమీ లేదని అనుకున్నారేమో ఆ టాపిక్ తీసుకురాలేదు. మెట్రో రైలు ప్రాజెక్టు అని చెప్పి దానికి నెల క్రితం వరకు డీపీఆర్ ఆమోదించలేదు. తీరుబడిగా ఇప్పుడు కేంద్రానికి పంపారు. భోగాపురం విమానాశ్రయానికి చంద్రబాబు శంకుస్థాపన చేస్తే...ఈయన దానికి నాలుగేళ్ల తరువాత మళ్లీ శంకుస్థాపన చేశారు. అప్పటివరకు ఏ పని



ముట్టుకోలేదు. సీఎం కాగానే కాపులుప్పాడలో హిస్టర్ పార్కుకు రూ.80 కోట్లతో శంకుస్థాపన చేశారు. దానికి ఇప్పటికీ డీపీఆర్ పూర్తికాలేదు. అదానీ డేటా సెంటర్‌కు టీడీపీ హయాంలో కేటాయించిన భూమిని అధికారంలోకి రాగానే రద్దు చేశారు. ఆ తరువాత మళ్లీ ఆయనే భూమి ఇచ్చి గత ఏడాది మే నెలలో శంకుస్థాపన చేశారు. అక్కడ ఇప్పటికీ పనులు మొదలు కాలేదు. విశాఖలోనే భారీ పెట్టుబడుల సదస్సు నిర్వహించినా విశాఖకు ఒనగూరిందేమీ లేదు. ఇక్కడ ఆయన హయాంలో చెప్పుకోదగిన అభివృద్ధి ఏమీ లేకపోవడంతో మిన్నకుండిపోయారని పార్టీ వర్గాలో గుసగుసలు వినిపించాయి.

ఇది ఎన్నికల శంఖారావం కావడంతో కనీసం జిల్లాలో పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థుల పేర్లు అయినా ప్రకటిస్తారని నేతలు భావించారు. భీమిలి నియోజకవర్గంలో సభ పెట్టి...పక్కనే సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు నిల్చొని ఉన్నా...అక్కడి అభ్యర్థి గురించి కూడా కనీసం ప్రకటన చేయలేదు. జిల్లా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గురించి ప్రస్తావన కూడా రాలేదు. ఇక విశాఖపట్నం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జిగా బొత్స ఝాన్సీని నియమించారు. కనీసం ఆమెను కూడా ఈ సభలో ప్రజలకు పరిచయం చేయలేదు. ఇప్పటికే నిర్ణయించిన అభ్యర్థులను వేదికపై పరిచయం చేసి, వారిని గెలిపించాలని కోరితే బాగుండేదని పార్టీ వర్గాలు అభిప్రాయపడ్డాయి. అయితే, ఇంకా మార్పులు జరిగే అవకాశం ఉందని, అందుకే అలాంటి ప్రయత్నం చేయలేదని సీనియర్ నాయకులు అంటున్నారు.

ఎన్నికలంటే వైసీపీ నేతలకు భయం

▸ టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలంటే వైసీపీ నాయకులకు, సీఎం జగన్‌కు భయంతో వణికిపోతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓటర్లు తరిమి కొడతారనే భయంతోనే తప్పుకుంటానని జగన్‌రెడ్డి చెబుతున్నారన్నారు. వైసీపీ నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి ఏమీ లేకపోగా ప్రకృతి వనరులను దోచుకున్నారని ఆరోపించారు. మంత్రి అమర్‌నాథ్ అవినీతి, అరాచకాలను వైసీపీ అధిష్ఠానమే గుర్తించి సీటు లేకుండా చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉంటే.. ప్రస్తుత వైసీపీ అరాచక పాలనలో అన్నిరంగాలు అధోగతి పాలయ్యాయని విమర్శించారు. త్వరలో జరగబోవు ఎన్నికల కురుక్షేత్రంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం మళ్లీ అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. జిల్లాలో ఓటర్ల జాబితాలను నియోజకవర్గ ఇన్‌చార్జిల పర్యవేక్షణలో టీడీపీ బూత్


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

కమిటీ సభ్యులు పరిశీలిస్తున్నారన్నారు. గతంలో ఫిర్యాదు చేసినా తుది జాబితాలో మృతుల ఓట్లు తొలగించలేదన్నారు. దీనిపై కలెక్టర్‌కు, ఎన్నికల కమిషన్‌కు మరోసారి ఫిర్యాదు చేస్తామని జగదీశ్వరరావు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు కేకేవీపీ నారాయణరావు, సాలాపు నాయుడు, దాడి అప్పారావు, కర్రి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అదనపు ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు చేయొద్దు

▸ సీపీఎం నాయకుల డిమాండ్

పరవాడ, జనవరి 27 : తాడి గ్రామానికి ఆనుకుని ఫార్మా అదనపు ల్యాండ్ ఫిల్ ఏర్పాటును తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణతో కలిసి ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటికే తాడి గ్రామం తీవ్ర కాలుష్య కోరల్లో చిక్కుకుందన్నారు. తాడి గ్రామంతోపాటు సాలాపువానిపాలెం, లంకెలపాలెం, తానాం, పరవాడ గ్రామాల ప్రజలు కూడా కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. తాడి రెవెన్యూ పరిధి సర్వే నంబరు 116లో రూ.200 కోట్లతో అదనపు ల్యాండ్‌ఫిల్‌ను


అదనపు ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఏర్పాటు చేయడం కోసం ఈనెల 30న ప్రజాభిప్రాయ సేకరణ కూడా చేయనున్నారన్నారు. తాడి గ్రామాన్ని తరలించకుండా అదనపు ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు చేయాలని చూడడం దుర్మార్గమన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ఉన్న ల్యాండ్‌ఫిల్‌ను కూడా వారు పరిశీలించారు.

ఫిబ్రవరి 27న

మోదకొండమ్మ తీర్థం



మాడుగుల, జనవరి 27: ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దేవత మాడుగుల మోదకొండమ్మ తీర్థం వచ్చే నెల 27వ తేదీ మంగళవారం జరగనుంది. ఇందుకు సంబంధించి ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు అధ్యక్షతన శనివారం కమిటీ సమావేశమై నిర్ణయం తీసుకున్నారు. తులసీ కల్యాణ మండపం, ఆలయం పైభాగంలో ఉన్న ఫంక్షన్ హాలు, గదులను శుభకార్యాలకు ఇచ్చేందుకు, ఆలయంలో భక్తుల రద్దీ సమయంలో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సమావేశంలో దంగేటి సూర్యారావు, శ్రీనాథ శ్రీనివాసరావుతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ ఫ్లాప్ షో

... 3వ పేజీ తరువాయి

సగం ఖాళీగా దర్శనమిచ్చింది. దీంతో వైసీపీ నాయకులు కూడా షాక్‌కు గురయ్యారు.

ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలు..

సభ కోసం వైసీపీ నాయకులు వందలాది ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలను ఏర్పాటుచేశారు. ప్రతి గ్రామానికి బస్సులను పంపించారు. ఇందుకోసం ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన బస్సులను వినియోగించారు. అయితే, వాహనాలు అయితే భారీగా సమీకరించారు గానీ ఆ స్థాయిలో ప్రజలను సభకు తీసుకురావడంలో నాయకులు విఫలమయ్యారు. ఒక్కో గ్రామం నుంచి కనీసం వంద మంది వచ్చేలా చూడాలంటూ సూచించారు. కానీ, ఒక్కో బస్సులో కనీసం పది నుంచి పదిహేను మంది కూడా రాలేదు. కొన్ని బస్సులు ఐదారుగురితోనే వచ్చాయంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

ప్రాంగణంలోకి వెళ్లేలా పోలీసులు ఒత్తిడి

ఇక స్థానిక నాయకులు ఒత్తిడి, ఇతర కారణాలతో సభకు వచ్చిన వారిలో చాలా మంది ప్రాంగణం లోపలకు వెళ్లేందుకు ఆసక్తి చూపించలేదు. సీఎం జగన్మోహన్‌రెడ్డి 3.50 గంటల సమయంలో హెలికాప్టర్‌లో ప్రాంగణానికి చేరుకున్నారు. అప్పటికి ప్రాంగణంలో పెద్దగా జనం లేరు. వందలాది మంది జాతీయ రహదారికి ఇరువైపులా, ప్రాంగణం బయటే ఉండిపోయారు. సీఎం రావడం, ముఖ్య నాయకుల నుంచి పోలీసులకు ఆదేశాలు రావడంతో ప్రాంగణం బయట ఉన్న వారిని పోలీసులు రోప్ సహాయంతో బలవంతంగా లోపలకు పంపించారు. ప్రజలను ఎంత లోపలకు తరలించినా సభా ప్రాంగణం ఖాళీగానే కనిపించడంతో వైసీపీ ముఖ్య నాయకులకు ఏం చేయాలో పాలుపోలేదు.

స్పందన అంతంతమాత్రమే..

తొలి ఎన్నికల సభ కావడంతో సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రసంగానికి పార్టీ శ్రేణుల నుంచి గట్టి స్పందన ఉంటుందని భావించారు. అయితే మొదటి ఐదు నిమిషాలు మాత్రమే కేడర్‌లో స్పందన కనిపించింది. ఆ తరువాత సీఎం ప్రసంగిస్తున్నంత సేపు సభా ప్రాంగణం సైలెంట్‌గానే ఉంది. ప్రతిపక్షాలపై సీఎం చేసే విమర్శలకు ఆశించిన స్థాయిలో కేడర్ స్పందించలేదు.

ప్రసంగం ప్రారంభం కాకముందే బయటకు..

సీఎం జగన్మోహన్‌రెడ్డి 4.10 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించారు. అయితే, సీఎం ప్రసంగం ప్రారంభం కావడానికి ముందే వందలాది మంది కార్యకర్తలు ప్రాంగణం నుంచి బయటకు వస్తూ కనిపించారు. ప్రసంగం ప్రారంభమైన తరువాత వందలాదిగా బయటకు వచ్చేశారు. సీఎం జగన్ సుమారు రెండు గంటలపాటు ప్రసంగించారు. ఆయన సుదీర్ఘ ఉపన్యాసంపై కేడర్‌లో అసహనం కనిపించింది. దీంతో చాలామంది బయటకు వెళ్లేందుకు యత్నించారు.

కేడర్‌తో మాటామంతీ ఏదీ..?

సంగివలస సభలో కేడర్‌తో సీఎం జగన్మోహన్‌రెడ్డి మాటామంతీ ఉంటుందని వైసీపీ నాయకులు చెప్పారు. కానీ, సభలో సీఎం సుదీర్ఘ ప్రసంగానికి ప్రాధాన్యం ఇచ్చారు గానీ కేడర్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. సీఎంతో మాట్లాడాలని భావించిన వందలాది మంది కార్యకర్తలను ఇది అసంతృప్తికి గురిచేసింది. అయితే క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులు, అసంతృప్తులు బయటపడతాయన్న ఉద్దేశంతోనే మాటామంతీకి సీఎం దూరంగా ఉండిపోయారని అంటున్నారు.

సెర్ప్ ఉద్యోగుల సమ్మె బాట

▸ నెహ్రూచౌక్‌లో ధర్నా


శిబిరంలో నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

అనకాపల్లి టౌన్, జనవరి 27: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. తమ న్యాయమైన డిమాండ్‌లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ నెహ్రూచౌక్‌లోని బస్టాప్ వద్ద శనివారం ధర్నా చేపట్టారు. సెర్ప్ సంస్థను ప్రభుత్వ సంస్థగా గుర్తించి పనిచేస్తున్న ఉద్యోగులకు కేడర్ ఫిక్స్ చేస్తూ పే స్కేల్ అమలు చేసి సర్వీస్ రెగ్యులర్ చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల సర్వీస్ క్రమబద్ధీకరణకు ఆర్థిక శాఖ ద్వారా పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ పరిధిలో శాంక్షన్ పోస్టులుగా గుర్తిస్తూ ఇచ్చిన ఆదేశాలు సర్క్యులర్ మెమోపై తగు జీవో ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం ఉన్నట్టువంటి ఈపీఎఫ్ సీలింగ్ విధానం తీసివేసి మూలవేతనంపై వంద శాతం ఈపీఎఫ్‌ను అమలు చేయాలన్నారు. సెర్ప్ హెచ్‌ఆర్ పాలసీ ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్లు వర్తింపజేస్తూ అర్హులైన ఉద్యోగులందరికీ ప్రమోషన్లు కల్పించాలని, పదవీవిరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు నానిబాబు, శ్రీనులతో పాటు ఉద్యోగులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

అల్లరి నరేశ్ హీరోగా యాక్షన్ చిత్రం

▸ ఫిబ్రవరి మూడో వారం నుంచి ఉపమాకలో షూటింగ్

▸ బచ్చలమల్లి సినిమా దర్శకుడు బి. సుబ్బు


ఉపమాక ఆలయం, పరిసరాలను పరిశీలిస్తున్న దర్శకుడు సుబ్బు తదితరులు

నక్కపల్లి, జనవరి 27: హాస్య మూవీస్ బ్యానర్‌పై అల్లరి నరేశ్ హీరోగా నిర్మితమవుతున్న బచ్చలమల్లి చిత్రం రెండో షెడ్యూల్ ఫిబ్రవరి మూడో వారం నుంచి నక్కపల్లి, ఉపమాక పరిసర ప్రాంతాల్లో జరుగుతుందని దర్శకుడు బి.సుబ్బు చెప్పారు. శనివారం బచ్చలమల్లి చిత్రం టెక్నికల్ సిబ్బందితో కలిసి నక్కపల్లి, ఉపమాక, రాజయ్యపేట ప్రాంతాలను దర్శకుడు సుబ్బు పరిశీలించారు. రాజేశ్ దండా నిర్మాతగా ఈ చిత్ర నిర్మాణం జరుగుతోందని, ఇప్పటికే మొదటి షెడ్యూల్ షూటింగ్ పూర్తయిందని సుబ్బు చెప్పారు. పూర్తి యాక్షన్ మూవీగా ఈ చిత్రం వుంటుందన్నారు. ఉపమాక ఆలయ పరిసర ప్రాంతాలు, నక్కపల్లి నూకాలమ్మ ఆలయం వద్ద భక్తి సన్నివేశాలను చిత్రీకరించేందుకు ఇక్కడ వాతావరణం అనువుగా వుందన్నారు. రెండేళ్ల కిందట సాయి ధరమ్‌తేజ హీరోగా సోలో బ్రతుకే సో బెటర్ సినిమా సుబ్బు దర్శకత్వంలో విడుదలైంది. ఈ చిత్రాన్ని దసరా నాటికి విడుదల చేస్తామని చెప్పారు. రిజర్ఫ్ నాథన్ కెమెరామన్‌గా అద్భుత చిత్రీకరణ జరుగుతుందన్నారు. తన పూర్వీకులది ఉపమాక గ్రామం కావడంతో ఇక్కడ సినిమా షూటింగ్ జరపాలన్న తన చిరకాల వాంఛ నెరవేరుతున్నందుకు చాలా సంతోషంగా వుందని దర్శకుడు సుబ్బు చెప్పారు.

సబ్‌జైలును సందర్శించిన న్యాయమూర్తి


రికార్డులు పరిశీలిస్తున్న న్యాయమూర్తి ప్రదీపా

అనకాపల్లి టౌన్, జనవరి 27 : అనకాపల్లి సబ్‌జైలును శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీపా సందర్శించారు. ఈ సందర్భంగా పాన్ ఇండియా క్యాంపెయిన్ నిర్వహించారు. జైలు రికార్డులను పరిశీలించి, నిందితులతో మాట్లాడారు. కార్యక్రమంలో జైలు అధికారులు పాల్గొన్నారు.



మూడు గ్రామాల్లో ఉపాధి సామాజిక బృందాల తనిఖీలు

కోటవురట్ల, జనవరి 27: మండలంలోని లింగాపురం, యండపల్లి, టి. జగ్గంపేట గ్రామాల్లో ఉపాధి హామీ సామాజిక ఆడిట్ బృందాలు శనివారం తనిఖీలు నిర్వహించాయి. లింగాపురంలో సామాజిక తనిఖీ బృందాలు ఉపాధి హామీ పనులను పరిశీలించాయి. కూలీల వేతనాలు, చేసిన పనిదినాలను అడిగి తెలుసుకున్నారు. యండపల్లి, టిజగ్గంపేటల్లో చేసిన ఉపాధి హామీ పనులను పరిశీలించాయి. అనంతరం ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, సోషల్ ఆడిట్ బృందం తనిఖీ చేసిన నివేదిక ఆమోదం పొందారు. ఎస్‌ఆర్‌పీ రామారావు, ఏపీవో గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరులను దర్శించుకున్న టీడీపీ నేతలు

అనకాపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గవరపాలెం గౌరీపరమేశ్వరులను టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులను ఉత్సవ కమిటీ సభ్యులు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.







వైసీపీ నేతలకు ఓటు అడిగే హక్కు లేదు

» జనసేన మండల అధ్యక్షుడు శ్రీరామదాసు

అచ్యుతాపురం, జనవరి 27: అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయలేని వైసీపీకి వచ్చే ఎన్నికల్లో ఓటు అడిగే హక్కులేదని జనసేన మండల అధ్యక్షుడు బైలపూడి శ్రీరామదాసు అన్నారు. శనివారం సెజ్‌పునరావాస కాలనీ (దిబ్బపాలెం) పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో సెజ్ పునరావాస కాలనీలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టలేదన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వాసితుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. పారిశుధ్య లోపం కారణంగా కాలనీ వాసులంతా దోమలతో జీవనం గడపాల్సి వస్తోందన్నారు. తాగు నీరు కూడా లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వచ్చే ఎనికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో తుమ్మల రాజు, లాలం తాతారావు, రుత్తల కనకారావు, లాలం రాంబాబు, జాగారపు రమేష్ పాల్గొన్నారు.

నేడు నాగులాపల్లిలో వైద్య శిబిరం

మునగపాక, జనవరి 27: మండలంలోని నాగులాపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. దివంగత మాజీ సర్పంచ్ మళ్ల అప్పలనాయుడు జ్ఞాపకార్థం ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు ఆయన తనయుడు డాక్టరు హరిప్రసాద్ తెలిపారు.





అభివృద్ధి పనులకు మంత్రి, ఎంపీ శంకుస్థాపన


ఇండోర్ స్టేడియంలో అభివృద్ధి పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి,తదితరులు

అనకాపల్లి టౌన్, జనవరి 27 : పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి శనివారం శంకుస్థాపన చేశారు. ఎంపీ నిధులు రూ.11.5 లక్షలతో జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అప్రోచ్‌రోడ్డు, రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియాన్ని ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులు రూ.రెండు కోట్లతో అభివృద్ధిపరిచేందుకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జేసీ జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరన్‌రాజ్, జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణ, వైసీపీ నియోజకవర్గ సమన్వయ కర్త మలసాల భరత్‌కుమార్, కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ స్వాగత ఆర్చి ప్రారంభం

అనకాపల్లి కలెక్టరేట్ : జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. అనకాపల్లి-ఆనందపురం రహదారి నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే రహదారిలో కలెక్టరేట్ వద్ద రూ. 2.5 లక్షలతో నిర్మించిన ఆర్చిను కలెక్టర్ రవి పట్టన్‌శెట్టితో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జేసీ జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించడంలో జగన్‌రెడ్డి సిద్ధహస్తుడు

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, జనవరి 27: ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ప్రజలను మోసగించడంలో సిద్ధహస్తుడని టీడీపీ ఎలమంచిలి నియోజక వర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్య నిషేధం చేస్తానని ఎన్నికల ముందు వాగ్దానం చేసి దానితోనే భారీ వ్యాపారం చేస్తున్నారన్నారు. దళితులపై దాడులు, బీసీలపై కక్షసాధింపు చర్యలు, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించకుండా చేయడం వంటి కార్యక్రమాల్లో జగన్ సిద్ధహస్తుడన్నారు. ఇటువంటి వ్యక్తిని ప్రజలంతా కలిసి ఇంటికి పంపాలన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థికి గెలిపించి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు జనపరెడ్డి నరసింగరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు బొండా జగన్నాథం, దొడ్డి శ్రీనివాసరావు, దిన్‌బాబు, జి.నానాజీ, మామిడి శివ అప్పారావు, వై.అప్పలనాయుడు, కె.రాజశేఖర్, ఏ.ఆదిమూర్తి, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఆర్‌వో ప్లాంటు ప్రారంభం


ఆర్వో ప్లాంటు ప్రారంభిస్తున్న పోలా భాస్కర్, వీఎల్ నరసింహ

సబ్బవరం, జనవరి 27 : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో కెమిస్ట్రీ అధ్యాపకుడు వీవీజే గోపాలకృష్ణ తండ్రి వి.సూర్యనారాయణ (రిటైర్డ్ ఎంఆర్వో) జ్ఞాపకార్థం కళాశాలకు రూ. 2.5 లక్షల విలువ గల ఆర్‌వో ప్లాంటును వితరణగా అందజేశారు. ఈ ఆర్వో ప్లాంటును శనివారం కళాశాల ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. విద్యార్థులు నాణమైన విద్యను అభ్యసిస్తూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు. ఇటీవల జాతీయ స్థాయిలో స్వే మార్షల్ ఆర్ట్సులో స్వర్ణ పతకాన్ని సాధించిన విద్యార్థిని ఎస్.లలిత కామేశ్వరిని కమిషనర్ పోలా భాస్కర్ సత్కరించారు. అయన్ని ప్రిన్సిపాల్ సీవీఎస్ఎస్ శాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ బి.శంకర్, ఎం.కాళీ, వీఎల్ నరసింహ సత్కరించారు.

స్క్రీనింగ్‌తో మహిళల్లో క్యాన్సర్ నివారణ

» డాక్టర్ లీల దిగుమర్తి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్య నిపుణులు లీల దిగుమర్తి

నక్కపల్లి/పాయకరావుపేట రూరల్, జనవరి 27: జాగ్రత్తలు, అవగాహనాతోనే రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ సోకకుండా మహిళలు నివారించుకోవచ్చునని క్యాన్సర్ విభాగం నిపుణురాలు డాక్టర్ లీల దిగుమర్తి చెప్పారు. అమెరికాలోని బోస్టన్‌కు చెందిన మానవసేవ అనే స్వచ్ఛంద సంస్థ, హైదరాబాద్‌లోని సీకే అభివృద్ధి సంస్థ భాగస్వామ్యంతో నక్కపల్లి మండలం వేంపాడు, పాయకరావుపేట మండలం పెదరాంభద్రపురం జడ్పీ హైస్కూళ్లలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. హెచ్‌పీవీ (హ్యూమన్ పాలిలోమ వైరస్) వల్ల మహిళల్లో సోకే రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లను స్క్రీనింగ్ ద్వారా నివారించుకోవచ్చునని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంస్థల ద్వారా 9 ఏళ్ల వయస్సు నిండిన బాలికలకు హెచ్‌పీవీ వల్ల క్యాన్సర్ రాకుండా టీకాలు వేస్తున్నట్టు చెప్పారు. బాలికలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

మానవసేవ సంస్థ వ్యవస్థాపకుడు శాస్త్రి ద్వివేదుల మాట్లాడుతూ సుమారు రూ.10 లక్షలతో పెదరాంభద్రపురం, 25 లక్షలతో వేంపాడు జెడ్పీ పాఠశాలలోని విద్యార్థులకు క్యాన్సర్ రాకుండా టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో లక్ష్మీ ద్వివేదుల, హెచ్‌ఎంలు నరసింగరావు, కోడి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబాను దర్శించుకున్న రత్నాకర్


సాయిబాబాను దర్శించుకుంటున్న దాడి రత్నాకర్

కశింకోట, జనవరి 27 : మండలంలోని చింతపాలెంలో షిర్డీ సాయిబాబాను తెలుగుదేశం పార్టీ యువనేత దాడి రత్నాకర్ దర్శించుకున్నారు. శనివారం జరిగిన తీర్థ మహోత్సవంలో భాగంగా సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా రత్నాకర్ సాయిబాబాకు ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు రత్నాకర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేగి దొరబాబు, కూన రమణ, తాతబాబు, కలగా సోమేశ్వరరావు, మజ్జి కుమార్, పక్కుర్తి సంతోష్, కోన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి స్పోకెన్ ఇంగ్లీషు పోటీల్లో మోన్షిత ప్రతిభ


మోన్షితను సత్కరిస్తున్న హెచ్‌ఎం తిరుపతిరావు, సిబ్బంది

సబ్బవరం, జనవరి 27 : గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని జిల్లా స్థాయిలో నిర్వహించిన స్పోకెన్ ఇంగ్లీషు పోటీల్లో స్థానిక ప్రభుత్వ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని బి.మోన్షిత ప్రథమ స్థానంలో నిలిచింది. బాలికను గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, డీఈవో వెంకటలక్ష్మమ్మ ప్రశంసాపత్రంతో సత్కరించారు. శనివారం విద్యార్థిని మోన్షితను స్కూల్లో హెచ్‌ఎం తిరుపతిరావు, సిబ్బంది సత్కరించారు.







రూరల్ ఎస్ఐగా తేజేశ్వరరావు బాధ్యతల స్వీకారం

కొత్తూరు, జనవరి 27 : అనకాపల్లి రూరల్ పోలీసుస్టేషన్ ఎస్ఐగా జి.తేజేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పరవాడలో ఎస్ఐగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన సీహెచ్ నరసింగరావు నేషనల్ హైవే స్క్వాడ్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ తేజేశ్వరరావు మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

ఉత్తమ ఎంఈవోకు సన్మానం


ఎంఈవో మూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, జనవరి 27: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఎంఈవోగా అవార్డు అందుకున్న ఎంఈవో ఏఎస్ఎస్ఏఎస్ మూర్తిని పీఆర్‌టీయూ నాయకులు శనివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బొజ్జా రామారావు, జిల్లా కార్యదర్శి రమేష్, కౌన్సిలర్ ప్రకాష్, వైడీవీకే ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్త్ మోడల్ టెస్ట్ విజేతలకు బహుమతులు

అచ్యుతాపురం, జనవరి 27: పదో తరగతి ఉత్తీర్ణతా శాతం పెంచడానికి మోడల్ టెస్టులు ఎంతగానో ఉపయోగపడతాయని అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన టెన్త్ మోడల్ టెస్టులో పది మంది టాపర్‌లకు శనివారం స్థానిక హైస్కూల్‌లో బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ, రెడ్డి గణేష్, ఎం.రమణ, జి.గీతాకృష్ణ, సోమునాయుడు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లకు రంగులు వేయాలి

పరవాడ, జనవరి 27 : స్థానిక ప్రధాన రహదారిలోని ప్రాథమిక పాఠశాల, బొంకులదిబ్బవీధి సమీపంలో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లకు రంగులు వేయాలని స్థానికులు కోరుతున్నారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి సుమారుగా ఆరు నెలలు కావస్తున్నా నేటికి రంగులు వేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు స్పీడ్ బ్రేకర్లను గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో ఇక్కడ తరచూ ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లకు రంగులు వేయాలని స్థానికులు కోరుతున్నారు.







నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రం

చెరువులో చెత్త!

- మాకవరపాలెంలో నిరుపయోగంగా సంపద కేంద్రం
- అధికారులు పట్టించుకోకపోవడంతో సమీపంలోని సాగునీటి చెరువులో చెత్తాచెదారం పారబోత
- పంట భూములు పాడవుతున్నాయని ఆయకట్టు రైతులు గగ్గోలు



పాపయ్య చెరువులో చేరిన చెత్తాచెదారం

మాకవరపాలెం, జనవరి 27 : ఇటు అధికారుల నిర్లక్ష్యం.. అటు పల్లెవాసుల అవగాహనా లోపం వెరసి చాలాచోట్ల సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారుతున్నాయి. ఫలితంగా చెత్తను ఇష్టారాజ్యంగా పారబోస్తుండడంతో కొందరికి అవస్థలు తప్పడం లేదు. ఇందుకు ఉదాహరణగా మాకవరపాలెంలోని పాపయ్య చెరువును చెప్పవచ్చు. టీడీపీ హయాంలో ఓవైపు చెత్త సమస్యకు పరిష్కారం చూపుతూనే.. మరోవైపు పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి కలిగించాలన్న మహదాశయంతో సంపద కేంద్రాలను నిర్మించారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇందులో చాలా వరకు లక్ష్యానికి అనుగుణంగా పనిచేశాయి. అనంతరం వైసీపీ అధికారంలోకి రావడంతో వీటి నిర్వహణపై అంతగా శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఫలితంగా పలు గ్రామాల్లో ఇవి నిరుపయోగంగా మారడంతో పాటు చెత్త తీరని సమస్యగా మారుతోంది. మాకవరపాలెంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ.పది లక్షలు వెచ్చించి సంపద కేంద్రాన్ని నిర్మించారు. ఇక్కడ అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు. గత కొన్నేళ్లుగా ఇది నిరుపయోగంగా మారడంతో ఊరిలోని చెత్తను ఇక్కడ వేయడం మాని దీనిని ఆనుకుని ఉన్న పాపయ్యచెరువులో పారబోస్తున్నారు. ఇది రైతులకు ఇబ్బందికరంగా మారుతోంది. ఈ చెరువు కింద సుమారు వంద ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ నీటినే ఆయా రైతులు సాగుకు వినియోగిస్తుంటారు. అలాగే మేతకు తోలుకు వచ్చే పశువులు కూడా ఈ నీటినే తాగుతుంటాయి. ప్రస్తుతం చెత్త పారబోస్తుండడం వల్ల ఆ నీరు కలుషితంగా మారుతోంది.

బ్రాహ్మణుల సంక్షేమానికి నిధి ఏర్పాటు



విరాళం అందచేస్తున్న కృష్ణమూర్తి

చోడవరం, జనవరి 27 : నియోజకవర్గంలోని బ్రాహ్మణుల సంక్షేమానికి నిధి ఏర్పాటుకు ఇక్కడి గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా ట్రస్టు సభ్యులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ట్రస్టు కన్వీనర్ కందర్ప కృష్ణమూర్తి తనవంతుగా రూ.లక్షా వెయ్యి నూటపదహారులను ట్రస్ట్ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పుల్రేవు శ్యామ్, నేతల వింజమూరి శంకర్, ఉపాధ్యాయుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితాలోనూ తప్పుల తడకలే!

రోలుగుంట, జనవరి 27 : గతంలో విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో అనేక లోపాలు వెలుగుచూశాయి. ఎలాంటి తప్పులు లేని తుది ఓటరు జాబితాకు యంత్రాంగం కసరత్తు చేసినా మళ్లీ లోపాలే దర్శనమిస్తున్నాయి. రోలుగుంట మండలంలోని పలు గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితాలను పరిశీలిస్తే పరిస్థితి అర్థమవుతుంది. బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి సర్వే సక్రమంగా నిర్వహించక పోవడం వల్లే తరుచూ తప్పులు పునరావృతం అవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొంతలంలో ఒకరికే మూడు ఓట్లు

కొంతలం గ్రామంలోని పోలింగ్ కేంద్రం 21లో ఇదే గ్రామానికి చెందిన కోరుకొండ సాయి తండ్రి రాజుబాబు పేరు మీద ఒకే డోర్ నెంబర్‌తో క్రమ సంఖ్య 670, 671, 672లలో మూడు ఓట్లు ఉన్నట్లు ముద్రించారు. దీంతో ఆయన మాట్లాడుతూ ఏ నంబరుతో ఉన్న ఓటును సద్వినియోగం చేసుకోవాలో తెలియడం లేదని వాపోయారు. అలాగే ఇదే గ్రామంలో పోలింగ్ కేంద్రం 22లో మజ్జి నాయుడు క్రమ సంఖ్య 473లో డబ్ల్యూడబ్ల్యూవీ 1241579 గల ఓటు ఉన్న వ్యక్తి చనిపోయి నాలుగేళ్లు అవుతున్నా నేటికీ ఓటరు జాబితాలో ఓటరుగా కొనసాగుతున్నారు. పలుమార్లు బీఎల్వోలకు సదరు పేరు తొలగించాలని ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేదని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

వడ్డిప గ్రామంలో అధిక సంఖ్యలో తప్పుల తడకలు

వడ్డిప గ్రామంలో 60 నుంచి 70 మందికి పైగా డబుల్ ఎంట్రీలు, డెత్ ఓట్లు, ఇతర ప్రాంతాల్లో ఉన్నట్లు ఉన్నాయి. వీటిలో మచ్చుకు కొన్ని.. వడ్డిప గ్రామంలో పదేళ్ల క్రితం వీఆర్వోగా పనిచేసి రిటైర్ అయి స్వగ్రామం కొవ్వూరు వెళ్లినా నేటికీ వడ్డిపలో ఓటు కొనసాగుతుంది. సదరు మాజీ వీఆర్వో నరసింహారావుకు కొవ్వూరులో ఓటు ఉంది. రోలుగుంట మండలం కొవ్వూరు గ్రామానికి చెందిన యర్రంశెట్టి నరసింహారావు తండ్రి ఆదినారాయణ పదేళ్ల క్రితం వడ్డిప వీఆర్వోగా పనిచేసి రిటైర్ అయ్యాడు. అప్పటి నుంచి వడ్డిపలో పోలింగ్ కేంద్రం 9లో క్రమ సంఖ్య 808లో డబ్ల్యూడబ్ల్యూవీ01900652 నెంబర్‌తో ఓటు ఉంది. అలాగే స్వగ్రామం కొవ్వూరులో పోలింగ్ కేంద్రం 19లో క్రమ సంఖ్య 277లో కూడా ఓటు ఉంది. పక్క గ్రామమైన రాజన్నపేటకు చెందిన తేలు దుర్గా భవానీకి క్రమ సంఖ్య 525, 528లలో రెండు ఓట్లు ఉన్నాయి.

అదేవిధంగా క్రమ సంఖ్య 666లో రాజాన్నపేటకు చెందిన మంతిన నానాజీకి ఇక్కడ ఓటు ఉంది. రాజమండ్రిలో ఉంటున్న లంకా సత్యనారాయణ తండ్రి జానమ్మపాత్రుడుకి క్రమ సంఖ్య 761లో ఓటు ఉంది. అనకాపల్లికి చెందిన అల్లాడ లక్ష్మి, అల్లాడ వెంకట్రావులు వడ్డిపలో 15 ఏళ్ల క్రితం భూమి కొనుగోలు చేసి కొన్నాళ్లు ఇక్కడే ఉండడంతో వారికి కూడా ఇక్కడే క్రమ సంఖ్య 764, 766లలో ఓట్లు ఉన్నాయి. అప్పటి నుంచి పలు మార్లు ఫిర్యాదులు చేస్తున్నా నేటికీ ఓటర్ల జాబితా నుంచితొలగించ లేదని అంటున్నారు. క్రమ సంఖ్య 772లో పెద్దిరెడ్ల అప్పారావు తండ్రి అప్పలనాయుడు, క్రమ సంఖ్య 800లో పెదిరెడ్ల సోమన్నపాత్రుడు తండ్రి లచ్చన్నపాత్రుడు, క్రమ సంఖ్య 804లో పెదిరెడ్ల సత్యనారాయణ తండ్రి సింహాచలంలు చనిపోయి ఐదేళ్లు అవుతున్నా నేటికీ వీరికి ఓట్లు ఉన్నాయి.

ప్రైవేటు ఎలక్ట్రీషియన్ల ర్యాలీ



నర్సీపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎలక్ట్రీషియన్లు

నర్సీపట్నం అర్బన్, జనవరి 27 : ప్రైవేటు ఎలక్ట్రీషియన్లను ప్రభుత్వం గుర్తించాలని నర్సీపట్నంలో వారంతా శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వృత్తిపై లక్షలాది మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో గుర్తించి ప్రోత్సహించాలన్నారు. అలాగే, థామస్ అల్వా ఎడిషన్ బల్బు కనిపెట్టిన రోజు జనవరి 27ను ప్రభుత్వం అధికారింగా ఎలక్ట్రీషియన్ల డేగా నిర్వహించాలని వారంతా కోరారు.

జగన్ అరాచక పాలనకు చరమగీతం

- అప్పుల ఊబిలో చిక్కుకున్న రాష్ట్రానికి చంద్రబాబు వంటి సమర్థుడు అవసరం
- ప్రజలందరి ఆకాంక్ష ఇదే
- టీడీపీ శ్రేణుల శిక్షణ శిబిరంలో బత్తుల తాతయ్యబాబు, పీవీజీకుమార్



వడ్డాదిలోని శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, జనవరి 27 : రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న జగన్ రెడ్డిని ఇంటికి పంపడమే లక్ష్యంగా టీడీపీ శ్రేణులంతా పనిచేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు పిలుపునిచ్చారు. మండలంలోని తురకలపూడి, వడ్డాదిలలో శనివారం జరిగిన పార్టీ సెక్టార్ ఇంటిగ్రేటెడ్ శిక్షణ శిబిరాల్లో మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సైనికుల వలే ముందుకు సాగాలన్నారు. మద్యపాన నిషేధం చేసి ఓటు అడుగుతానన్న జగన్ మాటతప్పి మహిళలను మోసం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా మైనింగ్, ఇసుక, మద్యం మాఫియా దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా ఉన్నారన్నారు. మెట్రో, పోలవరం, రాజధాని ఇతర అభివృద్ధి కార్యక్రమాలు ఎక్కడెక్కడ చేశారో వైసీపీ పాలకులు, నాయకులు చూపించాలని తాతయ్యబాబు సవాల్ విసిరారు. సూరే సతీష్‌కుమార్ టీడీపీ యాప్‌లోని ఫ్యూచర్స్‌పై వివరించారు. అనంతరం ఓటరు హౌస్ మ్యాపింగ్‌పై శిక్షణ ఇచ్చారు. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గునూరు మల్లునాయుడు, తెలుగు యువత ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, కోరుకొండ రవికుమార్, వడ్డాది పట్టణ అధ్యక్షుడు దొండా నరేష్, కార్యదర్శి సింగంపల్లి రమేష్, బుచ్చెయ్యపేట సర్పంచ్ సుంకర లక్ష్మి, ద్వారపూడి నాయుడు, సాయం శేషు, దొడ్డి కిషోర్, దొండా వెంకటరమణ, గొన్నా బత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రావికమతం : కష్ట కాలంలో పార్టీకి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ రానున్న రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు అన్నారు. మండలంలోని గొంప, మేడివాడ, కొత్తకోట గ్రామాల్లో శనివారం బూత్ ఇన్‌చార్జిలు, క్లస్టర్లు, యూనిట్, కుటుంబ సాధికార సారథులకు నిర్వహించిన ఇంటి గ్రేటెడ్ శిక్షణ శిబిరంలో మాట్లాడారు. వైసీపీ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తుందన్నారు. ప్రస్తుతం అన్నిరంగాల్లో వెనుకబడిన రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. టీడీపీ శ్రేణులంతా పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, గొంప ఎంపీటీసీ గంజి సూర్యనారాయణ, కోట గోవిందరావు, ఉగ్గిన శ్రీను, కె.సత్యనారాయణ, వజ్రపు శివ తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట : వైసీపీ నిరకుంశ పాలనను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని టీడీపీ శ్రేణులకు ఆ పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని నిండుగొండలో క్లస్టర్ ఇన్‌చార్జి, బీసీ సెల్ అధ్యక్షులు సుర్ల బాబులనాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటైన ఇంటిగ్రేటెడ్ శిక్షణ శిబిరంలో వారు మాట్లాడారు. వచ్చే మూడు నెలలు ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలన్నారు. వైసీపీ నాయకులు ఓటరు జాబితాలో దొంగ ఓట్లు చేర్పుతున్నారని జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. రానున్న ఎన్నికలే అందరి లక్ష్యం కావాలన్నారు. ఈ శిక్షణకు రోలుగుంట, కె.నాయుడుపాలెం, నిండుగొండ, కొండపాలెం, కొమరవోలు, జానకిరాంపురం, కుసర్లపూడి, ఎన్.కొత్తూరు గ్రామాలకు చెందిన బూత్ ఇన్‌చార్జిలుహాజరయ్యారు. పార్టీ మండల అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి, గుములూరు మల్లునాయుడు, ఒనుం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రోలుగుంట మండలం నిండుగొండ శిక్షణ శిబిరంలో టీడీపీ నాయకులు

'టీడీపీతోనే బీసీలకు న్యాయం'



జయహో బీసీ ర్యాలీ నిర్వహిస్తున్న పీవీజీ కుమార్ తదితరులు

మాడుగుల, జనవరి 27 : వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే బీసీలకు న్యాయం చేకూరే దిశగా చర్యలు తీసుకుంటారని టీడీపీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ అన్నారు. శనివారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో జయహో బీసీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజా వ్యతిరేక పాలనకు రోజులు దగ్గరపడ్డాయన్నారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు, పార్టీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ ఒనుం శ్రీనివాసరావు, మండల శాఖ అధ్యక్షుడు అద్దెపల్లి జగ్గారావు, కార్యదర్శి ఉండూరు దేముడు, లెక్కల కాశిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి పుప్పాల రమేష్, నందారపు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీని సాగనంపడమే లక్ష్యంగా టీడీపీ, జనసేన పనిచేయాలి'



పాతకృష్ణాదేవిపేట సమావేశంలో మాట్లాడుతున్న చింతకాయల రాజేశ్

కృష్ణాదేవిపేట, జనవరి 27 : ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న సీఎం జగన్‌ను గద్దె దించడమే లక్ష్యంగా టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు తనయుడు, మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి పాత కృష్ణాదేవిపేటలో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటైన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన సాగుతుందన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా చేయడంతో పాటు దోచుకోవడానికి, దాచుకోవడానికి జగన్ ప్రాధాన్యం ఇవ్వడంతో రాష్ట్రం అధోగతి పాలైందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడు వంటి సమర్థ నాయకుడు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, ఉప సర్పంచ్ దుంపలపూడి సహదేవుడు, టీడీపీ నాయకులు మువ్వల వరహాలబాబు, ఫుట్టా చిన్నాస్వామి, రమణలతో పాటు ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి పెద్దపీట : బూడి



పట్టాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ ముత్యాలనాయులు

చీడికాడ, జనవరి 27 : గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మండలంలోని వీరభద్రునిపేట నుంచి కొన్నెంపూడి, గొప్పూరు గిరిజన గ్రామాలకు రోడ్డు నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. గిరిజన గ్రామాలకు సురక్షితమైన నీటి సదుపాయం కల్పించేందుకు కృషిచేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ, సర్పంచ్ వంటాకు నర్సింహమూర్తి, మాజీ సర్పంచ్ పోతల వెంకటరమణ, నాయకులు గొల్లవిల్లి రాజబాబు, సుంకరి శ్రీనివాసరావు, రామునాయుడు, షేక్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పట్టాల పంపిణీ

కె.కోటపాడు : మండలంలో దీర్ఘకాలంగా ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న 85 మంది రైతులకు ఉప ముఖ్యమంత్రి బూడిముత్యాలనాయుడు శనివారం ఇక్కడ పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయరంగం అభివృద్ధితో పాటు రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పాటుపడుతున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రెడ్డి జగన్మోహన్, తహసీల్దార్ రమేష్‌బాబుతో పాటు పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు వైసీపీ వార్డు సభ్యులు టీడీపీలో చేరిక



పార్టీలో చేరినవారికి కండువాలు కప్పుతున్న గవిరెడ్డి

చీడికాడ, జనవరి 27 : మండలంలోని జైతవరం పంచాయతీకి చెందిన వార్డు సభ్యులు రుత్తల భూలోక, మొల్లి రాములయ్యలు వైసీపీకి శనివారం రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పలరాజుపురంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు వీరికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు, నాయకులు అక్కునాయుడు, పైల ముత్యాలనాయుడు, వెంకటరమణ, డోకల దేముడుబాబు, అక్కునాయుడు, రెడ్డి కాశీ విశ్వనాథం, రెడ్డి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

దిబ్బపాలెం మాజీ సర్పంచ్ మరిడయ్య మృతి



చీడికాడ, జనవరి 27 : దిబ్బపాలెం మాజీ సర్పంచ్ అరిశంకుల మరిడయ్య (80) అనారోగ్యంతో శని వారం ఉదయం మృతిచెందారు. 1981 నుంచి 1995 వరకూ ఆ పంచాయతీకి రెండుసార్లు సర్పంచ్‌గా పనిచేశారు. ఇతని భార్య రమణమ్మ 2013లో టీడీపీ నుంచి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఇదే పార్టీలో మరిడయ్య కొనసాగుతున్నారు. పార్టీ నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చిననందిపల్లి మాజీ సర్పంచ్ రామునాయుడు మృతి



దేవరాపల్లి : చిన నందిపల్లి మాజీ సర్పంచ్ పోతల రామునాయుడు శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు. ఇతని కోడలు పోతల చెల్లమ్మ సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీపీ భాస్కరరావు, బూర బాబూరావు, జడ్పీటీసీ కర్రి సత్యం తదితరులు సంతాపం తెలిపారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం

మాకవరపాలెం, జనవరి 27 : లచ్చన్నపాలెంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఆది దంపతులను దర్శించుకున్నారు. సాయంత్రం మేళతాళాలు, మంగళవాయిద్యాలతో పాటు బాణసంచా కాల్పుల నడుమ గ్రామ పురవీధుల్లో విగ్రహాన్ని ఊరేగించిన అనంతరం నిమజ్జనం చేశారు.

కృష్ణాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

బుచ్చెయ్యపేట, జనవరి 27 : వడ్డాది గ్రామంలోని యాదవ కాలనీలో నిర్మిస్తున్న కృష్ణాలయ నిర్మాణానికి కె.రామలింగరాజు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ కంపెనీ ఎండీ బి.శేషగిరిరావు రూ.లక్షా వెయ్యినూట పదహార్లను విరాళంగా అందించారు. ఈ మేరకు ఆలయ కమిటీ నిర్వాహకులకు ఇందుకు సంబంధించిన చెక్కును శనివారం ఇక్కడ అందజేశారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



విజేతలతో హెచ్‌ఎం, సత్యసాయి సేవాదళ్ సభ్యులు

కృష్ణాదేవిపేట, జనవరి 27 : సత్యసాయి సేవాదళ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో ఏఎల్‌పురం హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఈ మేరకు స్కూల్ హెచ్‌ఎం నాగభూషణం చేతుల మీదుగా విజేతలు కె.తేజస్విని, మౌనిక, స్పందనలకు శనివారం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవాదళ్ కన్వీనర్ దుల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ పోటీలు నిర్వహించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.20 వేలు వితరణ



హెచ్‌ఎంకు చెక్కు అందిస్తున్న ఉపాధ్యాయిని వరలక్ష్మి

మాకవరపాలెం, జనవరి 27 : మండల కేంద్రం మాకవరపాలెం హైస్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయిని వీటూరి వరలక్ష్మి ఆ పాఠశాలకు రూ.20వేల నగదును శనివారం వితరణగా అందజేశారు. పదో తరగతి పరీక్షల్లో పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి ఈ మొత్తాన్ని అందజేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు అచ్యుతరామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

నాతవరం, జనవరి 27: శృంగవరం గ్రామంలో ఎయిడ్స్ వ్యాధిపై శనివారం అవగాహన సదస్సు ఏర్పాటైంది. ఈ సందర్భంగా లింక్‌వర్కర్ ప్రోగ్రామ్ జిల్లా రిసోర్స్‌పర్సన్ ఎస్.గోవిందరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపరాదన్నారు. సర్పంచ్ ఉలబాల యర్రయ్యమ్మ, కార్యదర్శి కవితారాణి, లింక్‌వర్కర్ నాగబాబు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థులు సందడి



ప్రిన్సిపాల్, అధ్యాపకులతో కళాశాల పూర్వ విద్యార్థులు

చోడవరం, జనవరి 27 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 2001-03 ఇంటర్ సీఈసీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శనివారం కళాశాలలో సందడి చేశారు. ఇరవై సంవత్సరాల తరువాత అంతా కలుసుకోవడంతో వారి ఆనందాలకు అవధులు లేవు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉమారాణి, రిటైర్డ్ లెక్చరర్ ఎస్.దేముడు, పీడీ గోతిరెడ్డి రాంబాబు, లెక్చరర్లు మురళీధర్, గుడిమెట్ల సత్యనారాయణ, మాల్యాద్రి తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పల్లం మురళీకృష్ణ, పైడిపాల నాగరాజు, వంశీ, స్వాతి, శేఖర్, అలీషా, హైమ, శ్రీదేవి, మహాలక్ష్మి, కోమలి, గిరి. రామచంద్ర, వెంకటరావు, సాగర్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్‌పురంలో ఎటు చూసినా ఇంతే..!

- ఓవైపు మురుగు.. మరోవైపు చెత్త సమస్య
- భరించలేని దుర్వాసనతో అవస్థలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- వెంటాడుతున్న అంటువ్యాధుల భయం



గ్రామం మధ్యలో దుస్థితి



కొంగసింగికి వెళ్లే రూటులో చెత్తాచెదారం



ఏఎల్‌పురం గొల్లవీధిలో రోడ్డుపైకి చేరిన మురుగునీరు

కృష్ణాదేవిపేట, జనవరి 27 : గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో పారిశుధ్యం క్షీణించింది. ఎక్కడికక్కడ వీధుల్లో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. కాలువల్లో పూడిక తీయక మురుగు ముందుకు పారడం లేదు. కొన్నిచోట్ల రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళ్లెదుట సమస్య కనిపిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారని అంతా వాపోతున్నారు. ప్రధానంగా బీసీ కాలనీ, వినాయక వీధి, గొల్లపేట, ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అంతేకాకుండా చెత్తకుప్పలు రోడ్లకు ఇరువైపులా దర్శనమిస్తున్నాయి. కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా దోమల బెడద తీవ్రంగా ఉంది. వీటి కారణంగా రాత్రివేళ కంటిమీదకునుకు ఉండడం లేదని అంటున్నారు. ఇక్కడి సమస్యను డీపీవో శిరీషతో పాటు స్పందనలో కలెక్టరుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీలో ప్రధాన సమస్యపై కలెక్టర్ దృష్టి సారించాల్సిందిగా కోరుతున్నారు.